# ఎదురు తిరిగిన కథా నాయకుడు

కథా నాయకుని మీద పట్టరాని కోపం వచ్చింది నాకు. నేను సృష్టించిన వ్యక్తి, నా చెప్పుచేతల్లో మెలగవలసిన పాత్ర, నేను కూర్చోమంటే కూర్చొని నేను లేవమంటే లేవవలసిన వెధవ, నా మీదికే తిరుగుబాటు చేస్తాడా ? నాకు కోపం రాదా మరి — మీరే చెప్పండి. నేను పుట్టమంటే తాను పుట్టినాడు, నేను బ్రతకమంటే తాను బ్రతికినాడు, నేను చావమంటే తాను న్యాయంగా చావాలి ; కానీ నేను అతన్ని చావమని కూడా అనలేదు, (అంతమాట నేను యెట్లంటాను !) నేను చెప్పినట్లు నడచుకొమ్మన్నాను — అంతే. మూర్ఖుడు పంతం పట్టి కూర్చున్నాడు — ఎంత చెప్పినా విననంటే విననంటాడు. "నా ప్రవర్తనను నీవు నిర్ణయించడడ మేమి"టని యెదురుతిరిగి మాట్లాడినాడు. నాకు కోపం రాకూడదేమో మీరే చెప్పండి. ఎవరనుకున్నాడో తాను ? నాకు యిష్టం లేకపోతే తనకు జన్మే లేదని తెలుసుకోలేని అల్పుడు, నాకు కోపం వస్తే తన బ్రతుకు యేమౌతుందో ఊహించుకోలేని నీచుడు. అమాంతం కోపం వచ్చి కథా నాయిక చేతులలోనే అతని గొంతు పిసికేయించాలనుకున్నాను. లేకపోతే అతనితోనే ఆత్మహత్య చేయిస్తే అంతకంటె బాగుంటుందనుకున్నాను — వెధవకు బుద్ధి చెప్పినట్లుంటుంది.

అసలు వచ్చిన చిక్కు అక్కడే. అతన్ని చంపడం నాకు మొదటి నుండీ యిష్టంలేదు. అతను చస్తే యింకేముంది ? హఠాత్తుగా కథ విషాదాంతమై కూర్చోదూ ? నా కథ సుఖాంతం కావాలని నా కోరిక ; నా కథానాయకుడు శాశ్వతంగా, ఆ చంద్రతారార్కం సుఖపడాలని నా

ఆశ — అతన్ని నేను సృష్టించిందే అందుకు. కానీ వెధవ నాకే యెదురు తిరిగి కూర్చున్నాడు. నేను చెప్పినట్లు నడచుకోడానికి తనకు సిగ్గవుతుందట— యేం మాటలో చూడండి. తన సృష్టి స్థితి లయాల కన్నింటికీ నేను కారణభూతున్ని ; తన బ్రతుకంతా నా సంకల్ప వికల్పాల అధీనం. నా ఔదార్యమే అతని జీవం ; నా ఆదరణే అతని అంగరక్ష ; నా ఆశ్రయం లేకపోతే అతను కేవలం నిర్జీవుడు. నేను 'హుం' అంటే అతని రూపనామ క్రియలే నశిస్తాయి. నాకు కోపం వస్తే అతనికి యీ పద్నాలుగు లోకాల లోనూ ఉప్పురాయి పుట్టదు — వూపిరి పీల్చుకోవడానికి గాలికూడా దొరకదు. అటువంటి అనామకుడు, నా కాలిదూళి రేణువునుకూడా అతి పవిత్రంగా శిరసా వహించవలసిన అల్పుడు, ఆజన్మాంతం నాకు కృతజ్ఞత చూపించవలసిన హీనుడు, నన్నే ధిక్కరించినాడంటే నాకెంత కోపం రావచ్చునో మీరే ఊహించండి. పోనీ, అతనికి నేనేదైనా అన్యాయం తలపెట్టినానా అంటే — ఛీ, యే కథకుడైనా తన పాత్రకు తానే అన్యాయం చేస్తాడా ! — అందులోనూ కథా నాయకునికి ! ఒకవేళ విషాదాంత కథలు వ్రాసే వాళ్లు ఆ పని చేస్తారేమో కాని, నా ఉద్దేశమంతా సుఖాంత కథ వ్రాయాలనే, నా ప్రయత్నమంతా నా కథానాయకుణ్ని సుఖపెట్టాలనే, నా ప్రయాస అంతా అతని క్షేమం కొరకే. ఆ మాట యెన్నిసార్లు చెప్పినా వెధవకు అర్థమే కాకపోతే ! వట్టి కృతఘ్నుడు — నిలువునా పాతినా పాపం వుండదు, ఇటువుంటి వాళ్ళను.

యెంత శ్రద్ధతో, యెంత దూరదృష్టితో, అతనికి ఎన్ని సౌకర్యాలు కల్పించినానని ; అతని కొరకు ఎంతో అమూల్యమైన కథావస్తువును యెన్నుకున్నాను. యెంతో మనోహరమైన దేశకాల పరిస్థితులను సమకూర్చినాను. యే కథానాయకునికీ దొరకని దివ్యసుందర మూర్తిని కథానాయికను చేసినాను. శిరీష పేశలమైన హృదయం ఆమెకు అమర్చి

నాను. కథానాయకుని మనసారా ప్రేమించమని ఆమెను ఆదేశించినాను. పాపం ఆ అమ్మాయి ఆక్షేపణ లేకుండా ఒప్పుకుంది. అటువంటి కథానాయిక దొరికినందుకైనా ఆ వెధవ నాకు కృతజ్ఞత చూపించాలి. అంతటి అందమైన అమ్మాయి, తనను మనస్ఫూర్తిగా ప్రేమించే అమ్మాయి. బేషరతుగా తనకు వశంకావడానికి సిద్ధంగా వున్నది. న్యాయంగా మనిషి ఐనవా డెవడైనా ఆ పరిస్థితుల్లో కుక్కిన పేనుమాదిరి ఆ అమ్మాయిని స్వీకరించి, బ్రతికినంతకాలం చచ్చినట్లు సుఖపడతాడు. కానీ ఈ వెధవ మనిషైతేనా — వట్టి మూర్ఖుడు — జడుడు — కించిత్తైనా లోకజ్ఞానం లేని నీచుడు.

అతనికేదైనా లోటు చేసినానా అంటే అదీ లేదు. అతను కోరక ముందే కోరదగినవన్నీ సమకూర్చి పెట్టినాను. ఇరవై రెండు సంవత్సరాల పూర్ణ యౌవనం యిచ్చినాను. సంపూర్ణ ఆరోగ్యమూ, ఆకర్షణీయమైన ఆకారమూ, కావలసినంత ఐశ్వర్యమూ యిచ్చినాను. యిక విద్యా బుద్ధులంటారా — ఆ విషయంలో ఏ కథకుడూ చూపని ఔదార్యం చూపించినాను. శంకరాచార్యు నంతటి మేధావిని చేసినాను. వేదవ్యాసు నంతటి విద్యావంతుని చేసినాను. యేసుక్రీస్తు సౌజన్యం సమకూర్చినాను. గాంధీ మహాత్ముని చిరునవ్వు తగిలించినాను. ఇవన్నీ చాలవేమో అని గౌతమ బుద్ధుని విశాల హృదయం కూడా అతనికి అంటగట్టినాను. ఇంతకంటె ఏ కథకుడు చేయగలడు చెప్పండి. త్రిజగన్మోహిని ఐన ప్రేయసిని గూడా యిచ్చినానని ముందే చెప్పినాను గదూ? ఇంక నేను చెప్పినట్లు నడచుకోవడానికి అతనికేం రోగమా అని!

వ్యాసుడూ, శంకరుడూ వగైరా అన్నానని అతను మరీ పూర్వ కాలపు మనిషి అనుకునేరు. అబ్బే — వాళ్ళను కేవలం ఉదాహరణగా చెప్పినాను. నా కథానాయకుణ్ని అంత ఛాందసుణ్ణి చేస్తానా! త్రికాలాలకూ

ఆదర్శప్రాయుడైన కథానాయకుని సృష్టించాలనే నా ఆరాటమంతా. ఇరవయ్యో శతాబ్దపు సమకాలిక అధునాతన నవయువకుణ్ణిగానే తయారు చేసినాను అతన్ని ; ఆధునిక విజ్ఞానమంతా యిచ్చినాను ; విశ్వసాహిత్యమంతా అతనితో ఆపోశన పట్టించినాను. ఇంతకంటె యే కథకుడైతే యేమి చేయగలడో చెప్పండి. పోనీ మీరే ఆలోచించండి — అతనికింకా యేమైనా కోరదగిన దున్నదేమో.

అక్కడికీ యెంతో ఓర్పుతో, ఎంతో ఔదార్యంతో (యెంతైనా నా పాత్రే గదండీ) అడిగినాను : "అబ్బాయీ, నీకింకా యేం కావాలో్న కోరుకో," అని. వెధవ ! నా ఔదార్యం అపార్థంచేసుకోవడం తప్ప, తనకు వేరే ఉద్యోగమే లేనట్లు ప్రవర్తించినాడు. ఏమన్నాడో తెలుసునా ? "ఎంత ఔదార్యమండీ మీ దేశంలో కథకులకు ! యీ ఔదార్యంలో సహస్రాంశం మీ పెండ్లాలమీద చూపించకూడదూ ?" అన్నాడు. చూడండి — యెంత దురహంకారమో ! నాకే నీతులు నేర్పుతాడు — నీచుడు !

అసలు కథానాయకు లెక్కడైనా తమను సృష్టించిన కథకుల మీదికే తిరుగపడడం మీరెవరైనా విన్నారా ? బానిసలు తిరుగపడడమూ, భార్యలు తిరుగపడడమూ విన్నామనుకోండి. మన కొడుకులే మనమీదికి తిరగబడడం — సరే — ఆ దురదృష్టం కూడా మనలో చాలామందికి — అంటే దాదాపు కొడుకులు వున్న వాళ్ళందరికీ — కలిగిందనుకోండి. కానీ యిదేమిటి — మన పాత్రలు మన మీదికే తిరగబడడమంటే — యిది సహించతగిందేనా అని ? ఇక మన సాహిత్యమంతా యేమౌతుందీ అని ? ఒక వేళ యిది విప్లవాల యుగం అంటారేమో ? అన్ని దేశాల్లోనూ విప్లవాలు జరుగుతున్నాయంటే, పీడిత ప్రజలు తమ న్యాయమైన హక్కులు సాధించుకుంటున్నారని అర్థం. అంతే కాని — యిదేమిటి ? సాధించేదేమీ

లేకున్నా, నిష్కారణంగా, కేవలం తిరుగుబాటు కొరకే తిరుగుబాటు చేయడం — యే ప్రయోజనమూ లేకుండా, యే ఆశయమూ లేకుండా, కేవలం విప్లవం కొరకే విప్లవం వర్థిల్లాలి అన్నట్లు. ఆ మాటే అడిగినాను అతన్ని — "అబ్బాయ్, నీ తిరుగుబాటుకు ప్రయోజనం యేమి ?" అని.

అతను గౌతమ బుద్ధుని పోజుపెట్టి "యిది తిరుగుబాటు అని ఎవరన్నారు ?" అన్నాడు.

చెప్పవద్దూ — నాకు చెడ్డ కోపం వచ్చింది. పైగా ఆ పోజు ఒకటి ! (ఆ పోజు కూడా మొదట అతనికి నేనిచ్చిందే అనుకోండి. ఐనా నా మీదికే ప్రయోగించడం !)

కోపమంతా దిగమింగి శాంతంగా అడిగినాను : "నేను నీ సృష్టికర్తను. నా యిచ్ఛకు లోబడినంతవరకే నీకు అస్తిత్వం, నా యిచ్ఛను వ్యతిరేకించడమే తిరుగుబాటు."

అతను శిలువమీది యేసుక్రీస్తు మాదిరి విషాద వదనంతో అన్నాడు: "నాకూ యిచ్ఛ వున్నది, నా యిచ్ఛను నేను పాలిస్తాను. అది తిరుగుబాటు అనుకోవడం నీ అవివేకం."

ఆ మనిషిని అట్లనే శిలువకు వేస్తామన్నంత కోపం రాదేమో మీరే చెప్పండి. నా కోపం అణచుకుందామన్నా అణగలేదు. కోపంగానే అన్నాను — కొంచెం గద్దించినట్లే అన్నాననుకోండి, "నీకు బ్రతకాలనే ఆశ లేదా ?" అని.

అప్పటికైనా అతనికి బుద్ధి వస్తుందనుకున్నాను — (యెంతైనా ప్రాణం అంటే తీపి గదా యెవరికైనా) అప్పుడు ముఖానికి గాంధీ మహాత్ముని చిరునవ్వు ఒకటి అలంకరించుకొని తాపీగా అన్నాడు : "ఇచ్ఛ వుండడమే బ్రతకడం, చావడమంటే స్వేచ్ఛ లేకపోవడమే."

ఇంక ఆ మనిషిని యేం చేయాల్నో మీరే చెప్పండి. తన యోగ్యతైనా గమనించుకోకుండా — యెంతైనా నేను సృష్టించిన పాత్రే గదా — నాతోనే అంత వేదాంతం మాట్లాడుతాడా! అసలు అతన్ని అంత తెలివిపరుని చేయడం నాదే తప్పనుకోండి. ఐనా, యెంత తెలివిపరుడైతే మాత్రం కృతజ్ఞత యెందుకుండగూడదా అని? కుక్కల కుంటుంది గదండీ!

అసలు మా ఇద్దరికీ వచ్చిన అభిప్రాయభేదం మీకింత వరకూ చెప్పనే లేదు గదూ? సరే — అది కూడా వినండి. అతనికి అన్ని యోగ్యతలూ కల్పించి, ఒక ఊరూ, పేరూ అన్నీ యేర్పాటు చేసి, కులమూ, గోత్రమూ, పరిస్థితులూ, పరిసరాలూ, అన్నీ ఎంతో ఉదాత్తమైనవి సృష్టించి, యేలోటూ వుండకూడదని ఒక తల్లినీ, తండ్రినీ కూడా సమకూర్చి యిచ్చినాను. ప్రతి చిన్న విషయం కూడా యెంతో జాగ్రత్తగా ఆలోచించి చేసినాను. అతని తల్లిదండ్రులకు కూడా యెంత ఉత్తమ సంస్కారం యిచ్చినాననుకున్నారు! అతన్ని చూసిన వెంటనే యెవరైనా సర్వసద్గుణ సంపన్నుడని అనవలసినదే — సర్వ శుభ లక్షణ లక్షితు డని ఒప్పుకుని తీరవలసిందే. ఇన్ని చేస్తే కడకు .... యెందుకులేండి — కథ వినండి ముందు. అన్నీ అమర్చి ముచ్చటగా ముస్తాబుచేసి అతన్ని వీధిలో వదలినాను. సరే — యింతకు ముందే చెప్పినట్లు ఒక అందాలరాశిని అతని కొరకే సృష్టించినాను. అతని కున్నంత తెలివి ఆమెకు లేదనుకోండి. అందం వున్న తర్వాత ఆడపిల్లకు తెలివి లేకుంటే యేం చెప్పండి. అసలు కథానాయకుని మీద అభిమానంతోనే నే నామెను అంత తెలివిపరురాలిని చేయలేదు. అందమైన ఆడవాళ్ళకు తెలివి కూడా వుంటే, యింకేముండీ — కొంపలంటుకోవూ! ........ అన్నీ ఆలోచించే, (అవును మరి, కథ వ్రాయాలంటే ఎంత ఆలోచన కావాలనుకున్నారు!) అతన్ని ప్రేమించ

డానికి తగినంత తెలివి మాత్రమే ఆమెకు యిచ్చి, కార్లో కూర్చోబెట్టి — కొత్తకారు, 1958 మాడల్ — బయలుదేరమన్నాను. పాపం ఆ అమ్మాయి కిక్కురుమనకుండా బయలుదేరింది. ఆమెకు కూడా అతని కున్నంత తెలివే వుంటే నాగతి యేమయ్యేదో — యిప్పటికే చస్తున్నాను, ఒకనితోనే వేగలేక. సరే, అతను వీధిలో నడుస్తూ వుండడం, వెనుక కారు రావడం — కొత్తకారు గదా, అందుకని నిశ్శబ్దంగా వచ్చింది — అకస్మాత్తుగా చిన్న యాక్సిడెంట్ జరగడం — అకస్మాత్తుగా అంటే ప్లాను ప్రకారమే అనుకోండి — ఆ తరువాత అతన్ని కారులో యెక్కించుకొని ఆమె తన బంగళాకు తీసుకపోవడం, అన్నీ యథాక్రమంగా జరిగినాయి. తరువాత మూడు రోజులు అతను మంచంమీదనే వుండడం, అతనికి కావలసిన సపర్యలన్నీ ఆమె చేయడం, అవన్నీ కథలో మామూలే గదా. అతని యెడమ కాలికి గూడా ఆమే కట్టు కట్టుతూ వుండేది ఆ మూడు రోజులూ. ఆ మూడు రోజుల్లోనూ పెండ్లికాని కథానాయకుని మీద పెండ్లి కావలసిన నాయికకు పుట్టవలసిన ప్రేమంతా పుట్టింది. అతనికి అంతకంటె యింకేం కావాలి చెప్పండి. పాపం అంత అపురూపమైన అందగత్తె ముద్దుగా మూతి ముందుకు చాచి, అరమోడ్పు కన్నులతో 'నా సర్వస్వం స్వీకరించండి' అని కలకంఠంతో ప్రార్థిస్తే, అంతకంటె యేం కావాలో చెప్పండి. లక్షణంగా ఆమెను స్వీకరించి ఆనంద వీధుల్లో విహరించ గూడదూ! అంటే పెండ్లి చేసుకున్న తర్వాతనేనండీ — పెండ్లి కాకుండా యేమి జరిగినా, ఆ అపకీర్తి అంతా కథకునికే అని నాకు మాత్రం తెలియదా!

యింకొక వాక్యంతో కథ ఐపోతుంది గదా, నా బాధ్యత తీరిపోతుంది గదా, అని గంపెడాశతో యెదురు చూసినాను. కథకునికి అంతకంటె కావలసిందేముంది గనుక? వాళ్లిద్దరూ పెండ్లి చేసుకుంటే

కథ ఐపోతుంది ; అంతటితో మనం చేతులు కడుక్కోవచ్చు ; తరువాత వాళ్ళ బ్రతుకులు వాళ్ళే బ్రతుకుతారు. కల్పాంతం వరకు సుఖపడమని ఆశీర్వదించి పంపుతామనుకోండి — అటు తర్వాత మన బాధ్యతేముంది చెప్పండి.

పాపం ఆ అమ్మాయి అంత ముద్దుగా మూతి ముందుకు చాచి యెంత సేపున్నా, ఆ వెధవ యేమీ అనకపోతే కథ అంతమయ్యేదెట్లా ? అక్కడికీ ఆమె తెగించి వివాహ విషయం కూడా ప్రతిపాదించింది — ఆ విషయంలో అతని కేమైనా పట్టింపులున్నాయేమో అన్న అనుమానం వచ్చి. న్యాయంగా ఆమె అడిగినందుకైనా అతను వెంటనే ఒప్పుకొని వుండవలసింది. పోనీ వాళ్ళిద్దరినీ సృష్టించినవాణ్ణి కథకుని నన్ను చూసైనా అతను ఒప్పుకొని వుండవలసింది. అంతెందుకు ? — తన సుఖమే చూసుకున్నా ఆ సాయంత్రమే లగ్నం యేర్పాటు చేసుకోవలసింది. కానీ వెధవకు యేం బుద్ధి మారిందో — అంత వరకు బుద్ధిమంతుడనే గదా నా నమ్మకం — తన తెలివి అంతా ఆ అమ్మాయి మీద ప్రయోగించినాడు. "నన్ను పెండ్లి చేసుకోడానికేనా కారు క్రింద పడవేసింది ?" అని ప్రశ్నించినాడు. చూడండి, యెంత బుద్ధిలేని ప్రశ్నో ! న్యాయంగా ఆ ప్రశ్న కథానాయిక అడగవలసింది, "నన్ను పెండ్లి చేసుకోవాలనే నా కారు క్రింద పడినారు గదా ?" అని.

అంత ప్రశ్న అడిగితే ఆ అమ్మాయి యేం చేస్తుంది చెప్పండి ? ఆమెకు తెలిసినంతవరకూ నిజమే చెప్పింది : పొరపాటు వల్లనే యాక్సిడెంట్ జరిగిందని. దానికి తగిన తర్కం కూడా జోడించింది : "మిమ్మల్ని అప్పటికే ప్రేమించివుంటే, మీమీదికే కారు డ్రైవ్ చేసేటంత తెలివి తక్కువదాన్నా నేను ?" అన్నది. మరీ అంత తెలివి తక్కువది కాదు లేండి ఆ అమ్మాయైనా. ఆ ఆర్గ్యుమెంటు వింటూనే

కథా నిలయం
3794

అతని హృదయంలో వెంటనే ప్రేమ పుట్టి తీరవలసిందే. కానీ ఆ వెధవకు అంతమాత్రం జ్ఞానం వుంటేనా! పోగాలపు బుద్ధులు!

"పొరపాటువల్లనే యాక్సిడెంట్ జరిగిందనుకో. ఐతే నీ పొరబాటుకు ప్రాయశ్చిత్తంగా ఆత్మార్పణ చేసుకుంటున్నావా? లేక నా పొరబాటుకు శిక్షగా నన్ను బలి తీసుకుంటున్నావా?" అన్నాడు. వెంటనే ఆ అమ్మాయికి కండ్లలో నీళ్ళు తిరిగి బయటికి పారిపోయింది. అంతకంటె యేం చేస్తుంది చెప్పండి, పెండ్లికాని ముగ్ధ కథానాయిక.

నాకొక నిమిషంపాటు మూర్ఛవచ్చినంత పనైంది. కథానాయకుని విపరీత ప్రవర్తనవల్ల సుఖాంతం కావలసిన కథలో దుఃఖాంత లక్షణాలు ప్రవేశించినాయి. ఆ విషయం అర్థమౌతూనే, మొదట నాకు బ్రహ్మాండమైన ఆశ్చర్యం కలిగింది. కథకుని ఉద్దేశానికి భిన్నంగా కథానాయకుడు ప్రవర్తించడం ఆశ్చర్యం కాదూ? ఆశ్చర్యం వెంట ఆందోళనా, విచారమూ, కోపమూ అన్నీ కలిగినాయనుకోండి. మనసులోని భావాల చిక్కు అంతా విడిపించుకొని అతన్ని నిలదీసి అడిగినాను — తన ప్రవర్తనకు సంజాయిషి చెప్పమని.

"నా మీద ఆ అమ్మాయికి ప్రేమ యెందుకు కలిగిందో చెప్పు" అన్నాడు.

న్యాయంగా ఆ ప్రశ్న అడిగే హక్కు లేదు అతనికి. పోనీ లెమ్మని చెప్పినాను. "మూడు రోజులు నీవు మంచం దిగకుండా ఆమె యింట్లో వున్నావు. నీకు అన్ని సపర్యలూ చేయడమేగాక, రోజుకు కొన్ని గంటలు ఆమె నీతో ఏకాంతంగా గడపవలసి వచ్చింది. నీ వంటి ఆకర్షణ గల యువకుడు మూడు రోజులు అంత నిస్సహాయస్థితిలో వుంటే, అంత సంపూర్ణంగా ఆమెమీద ఆధారపడితే, అంత సుకుమార హృదయం

గల ఆడపిల్లకు నీమీద ప్రేమ కలగడం న్యాయమేగదా!" అన్నాను.

నిజంగా వున్న మాట అంతే గదండీ! మనశ్శాస్త్ర విజ్ఞానమంతా అందులో యిమిడి వుంది. ఆ పరిస్థితుల్లో ఆమెకు ప్రేమ కలగకుండా వుండడానికి వీలేలేదు. అందుకనే ఆ సన్నివేశం కల్పించినాను నా కథానాయకునికి. ఇంకా అనేక సన్నివేశాలు కల్పించవచ్చు ననుకోండి. ఉదాహరణకు అతన్ని హాస్పిటల్లో చేర్చి ఆమెను ఒక నర్సును చేయవచ్చు ననుకోండి. కానీ పేషంటును నర్సు ప్రేమించి తీరుతుందనే నమ్మక మేముంది చెప్పండి — రోజు కెంతమంది పేషంట్లను చూస్తూ వుంటుందో ఒక్కొక్క నర్సు! అందుకని నిస్సందేహంగా, నిర్నిబంధంగా, తప్పనిసరిగా ప్రేమ కలిగే సన్నివేశం యేర్పాటు చేసినాను. ఇంతచేస్తే యేమన్నాడని — వెధవ — కడకు!

గంభీరంగా ముఖం మార్చి, భగవద్గీత పోజుపెట్టి, నా తీర్పుకు తిరుగులేదనే కంఠంతో అన్నాడు: "నేను నిస్సహాయ స్థితిలో వుండగా ఆమెకు నా మీద ప్రేమ కలగడం న్యాయమో అన్యాయమో నాకు తెలియదు. కానీ నా నిస్సహాయ స్థితిని వ్యాపార వస్తువుగా జేసి, అందమైన ఆడపిల్లలను బుట్టలో వేసుకునేటంత నీచుణ్ణి గాను నేను."

నీచుడు — యెంత శిఖరాగ్ర వేదాంతం మాట్లాడుతాడో చూడండి. డామిట్, కథ అడ్డం తిరిగింది — అని అనవచ్చుననుకోండి యెవరైనా. కానీ డామిట్, కథా నాయకుడే అడ్డం తిరిగితే కథ యేం చేస్తుంది చెప్పండి.

కథ యెటూ ముగించకుండా అట్లనే వదలి పెట్టినాను. కథా నాయకుని పేరు కూడా యెవరికీ చెప్పదలచుకోలేదు. చావు బ్రతుకులు లేని చిత్తు కాగితాల చీకటి లోకంలో యెన్నాళ్ళుంటాడో వుండనీ — వెధవ!

(సెప్టంబరు 1958)